నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | ఏప్రిల్ 03, 2025 | www.navatelangana.com

వాహనాల పన్నుల వసూళ్లల్లో రాష్ట్రంలో కామారెడ్డి మొదటిస్థానం



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం వివిధ పన్నుల వసూళ్ళలో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ కు 92.4 శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుందని కామారెడ్డి రోడ్డు రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పన్నుల రూపంలో గత 2023 - 2024 సంవత్సరం లో రూ.63 కోట్లు వసూలు చేయగా దానికి 16 శాతం జోడించి ప్రభుత్వం ఈ సంవత్సరం 73 కోట్ల టార్గెట్‌ను విధించిందని అందులో 24 - 25 సంవత్సరానికి గాను 68 కోట్ల 19 లక్షల రూపాయల పన్నులు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ప్రజాప్రతినిధుల సహకారం సైతం ఉందని తెలిపారు.

కొత్తరేషన్ కార్డులపై గందరగోళం

- గ్రామ, వార్డు సభల్లో మంజూరైన వారికి పాత కార్డులోనే కలిపిన వైనం

నవతెలంగాణ-మోర్తాడ్



ప్రస్తుతం రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తుండటంతో.. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. రేషన్ కార్డు మంజూరు చేస్తే సన్నబియ్యం తమకు సైతం అందేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇటీవల గ్రామ, వార్డు సభల్లో రేషన్ కార్డులు పలువురికి మంజూరు అయినట్టు చెప్పగా.. తాజాగా వారి వివరాలను పాత రేషన్ కార్డులోనే నమోదు చేయడం గమనార్హం. కొత్త రేషన్ కార్డు వస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. కాగా ఈ విషయమై అధికారులను ఆరా తీయగా.. తమకు సైతం దీనిపై ఎలాంటి సమాచారం లేదని చెప్తుండటం గమనార్హం.

నిర్బంధాలతో ప్రజాపాలన ఎలా సాధ్యం..?

- నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను, సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం
- అక్రమ కేసులు ఎత్తివేసి హెచ్‌సీయూ భూములను యూనివర్సిటీకే కేటాయించాలి
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ప్రయివేటు వ్యక్తుల నుండి కాపాడిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం తమ ఖజానాను నింపుకోవాలని చూస్తుంది. ఈ భూమిని తిరిగి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ వద్ద విద్యార్థులు, సీపీఐ(ఎం) నాయకులు శాంతియుత నిరసన చేపట్టగా.. వారిని అక్రమంగా అరెస్టు చేయటంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని ఇది ఏ విధంగా ప్రజాపాలనా ప్రజాస్వామ్య పాలన అవుతుందో ఆలోచించాలని' సీపీఊఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ప్రశ్నించారు. భూములను హెచ్‌సీయూకే కేటాయంచాలని, విద్యార్థులపై, నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎ. రమేష్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు తమ పరిధిలోని 400 ఎకరాల భూములను ప్రభుత్వం అమ్మకం జరపకూడదని గత నాలుగు రోజులుగా నిరసన తెలియజేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఆడపిల్లలని కూడా చూడకుండా గొడ్లను ఈడ్చినట్టు ఈడ్చి పడేస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తూ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధాలను ఉపయోగిస్తు న్నారని మండిపడ్డారు. అక్రమంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థి కార్యకర్తలపైన అటెంప్ట్ మర్డర్ కేసును ప్రయోగించి జైలు పాలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తూ నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ప్రజలు తమ సమస్యలను శాంతియుతంగా వెలిబుచ్చుకునే అవకాశం కల్పించకుండా గత ప్రభుత్వం వలె నిర్బంధాలతో తమ చాలనుకుంటే ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకునే పరిస్థితి వస్తుందని అందుకు పాలకులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ కేసులను ఎత్తివేసి 400 ఎకరాల భూమిని యూనివర్సిటీ కేటాయించాలని లేనియెడల ప్రజల తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు జంగం గంగాధర్, విగ్నేష్, నగర నాయకులు కటారి రాములు, దినేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు ముగిసాయని ఎగిరి గంతేస్తున్న విద్యార్థులు

ముగిసిన పది పరీక్షలు

- ఎగిరి గంతేసి ఇంటిబాట పట్టిన విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మార్చి 21న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు బుధవారంతో ముగిసాయి. దీంతో విద్యార్థులు ఎగిరి గంతేసి ఇంటిబాట పట్టారు. కాగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. అయితే కామారెడ్డిలో గణితం ప్రశ్నపత్రంలో నుంచి పలు ప్రశ్నలు పరీక్ష సమయంలో సోషల్ మీడియాలోకి రావడంతో సంబంధిత బాధ్యుతలపై ఇది వరకే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న ఓ విద్యార్థిని

పరీక్షలు ముగియడంతో విద్యార్థులు అందరూ ఇంటి బాట పట్టారు. మంగళవారం విద్యార్థులు హాస్టల్లో నుండి బస్సు ప్రయాణానికి బయలుదేరారు. మంగళవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 22,743 మంది విద్యార్థులకు గాను 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు అని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిది

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్



పాదయాత్రలో పాల్గొన్న ముత్యాల సునీల్‌కుమార్

నవతెలంగాణ-బాల్కొండ

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిది అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మోహన్ రెడ్డి జెండా ఎగరవేసి పాదయాత్ర ప్రారంభించారు. జై బాపు..జై భీమ్.. జై సంవిధాన్ పాదయాత్ర జలాల్ పూర్ గ్రామం నుంచి ఇత్వార్ పేట్ మీదుగా కిసాన్ నగర్ వరకు కొనసాగింది. ఈ పాదయాత్రలో ముత్యాల సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలకు సమాన హక్కులను కల్పించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడు మీద ఉన్నదనీ, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అరవింద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ గౌడ్,జావిద్, చాట్ల నరేష్, యునుస్, కుందారపు శ్రీనివాస్, ఇమ్రాన్ ఖాన్, కిషన్ గౌడ్,షేక్.వహబ్, గంగాధర్, దేవేందర్, శేఖర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రిబేటు గడువు పొడిగింపు

- ఏప్రిల్ 30 వరకు చెల్లింపులకు అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అనధికార లే ఔట్ల క్రమబద్దీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మార్చి 31వ తేదీ నాటితో ఈ గడువు ముగియగా, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించిందని అన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎఫ్‌టిఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని సూచించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఏప్రిల్ 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. వివిధ కారణాల వల్ల రెగ్యులరైజేషన్ చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పిస్తూ రాయితీ సదుపాయం గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించిందని అన్నారు.

అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ సూచించారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని, దీనిని దష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఈ నెల 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం పొడిగించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

సన్న బియ్యం పంపిణీ సాఫీగా సాగాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ లో గల 21వ నెంబర్ రేషన్ షాపును కలెక్టర్ బుధవారం సందర్శించి, లబ్దిదారులకు స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు. రేషన్ దుకాణానికి కేటాయించబడిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కోటాకు అను గుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ ఉందా అని పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తన వెంట ఉన్న అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,10,012 మంది సభ్యులకు ప్రతీ నెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. జిల్లాలో మంగళవారం నుండి సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, బుధవారం మధ్యాహ్నం నాటికి 3183.095 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ పూర్తయ్యిందని, మొత్తం కోటాలో 38 శాతం పంపిణీ జరిగిందని కలెక్టర్ వివరించారు. కాగా, జాప్యానికి తావు లేకుండా సకాలంలో లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ జరిగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సహాయ అధికారి రవి రాథోడ్, రేషన్ డీలర్ హిమబిందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి పార్థసారథి, నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి విక్కీ యాదవ్ తదితరులు ఉన్నారు.



లబ్దిదారుకు పోసేందుకు బియ్యం తూకం వేస్తున్న కలెక్టర్

సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ సాధన


- 6 నుండి 14 వరకు జిల్లా వ్యాప్తంగా క్యాంపెయిన్‌ను జయప్రదం చేయండి
- సిఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.రమేష్
- ఆర్థిక, సామాజిక పోరాటాలే సీఐటీయూకు నిజమైన బలమని వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేశ్

ఈనెల 6 నుండి 14 వరకు జిల్లా వ్యాప్తంగా సిఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్‌ను జయప్రదం చేయాలని సిఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కుర్రపాటి రమేష్ హాజరై మాట్లాడుతూ.. 'ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉన్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని, మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికీ కొనసాగడం అమానుషం. కులం, మతం, ప్రాంతం, లింగ బేధం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజల్ని, కార్మికవర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముళ్ళ కంచెలా వున్నాయి. దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం పాలక వర్గాలు కార్మికవర్గంలో సున్నితమైన ఈ అంశాలను ముందుకు తెస్తున్నారు. దాంతో కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నాయి. సమాజంలో అన్నిరకాల దోపిడీ, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుండి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సిఐటియు తన ఆవిర్భావం నుంచి పని చేస్తున్నది. సామాజిక అణచివేత, వివక్ష, దోపిడీలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలతో శ్రామికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తున్నది. అందులో భాగంగా ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 14 వరకు జిల్లాలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ నిర్వహించాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ క్యాంపెయిన్లో సిఐటియు అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములు కావాలని, రాష్ట్ర కార్మికవర్గంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ ను విజయ వంతం చేయాలని' పిలుపునిచ్చారు.



హాజరైన కార్మికులు, నాయకులు

అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. జిల్లాలో నేటికీ ఇంకా అక్కడక్కడ పరిశ్రమల్లో, విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చాప కింద నీరులా కులవివక్ష కొనసాగుతున్నట్టు తెలిపారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ఉద్యోగులూ వివక్ష, దాడులకు గురవుతూనే ఉన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న లోపం వల్ల పదోన్నతులు దక్కడం లేదు. దళిత ఉద్యోగుల ఎడల రిజర్వేషన్ కేటగిరీ అంటూ చిన్న చూపు చూస్తున్నారు. డ్యూటీ చేస్తున్న పని ప్రదేశాలు మధ్యాహ్నం లంచ్ చేసే దగ్గర కూడా విపక్ష కొనసాగుతుంది. దేశంలో రోజుకు 86కు పైగా అత్యాచారాలు, అత్యాచార కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతి గంటకు 49 అమానుష ఘటనలు జరుగుతున్నాయి. వీటిల్లో అత్యధికం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే చోటు చేసుకోవడం గమనార్హం. పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినప్పటికీ దాని అమలును వాయిదా వేసి మోడీ ప్రభుత్వం మహిళలకు ద్రోహం చేసింది. దానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడకుండా సామాజిక న్యాయం సాధించలేము ఈ లక్ష్యంతోనే రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు కార్మిక వర్గం బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈవిఎల్ నారాయణ జంగం గంగాధర్, నన్నేసాబ్, మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రకళ జిల్లా నాయకులు సుకన్య రమేష్ రాజేశ్వరి పసియోద్దీన్ చిన్న లాలు, గంగాధర్ మురళి నరేష్ గణేష్ కార్తీక్ సందీప్ గోదావరి లక్ష్మి హరి శంకర్ సుమలత శేఖర్ జాకీర్ ఇమామ్, అబ్దుల్ కేధరమ్మ శీను, బుచ్చన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఎక్కువ ప్రారంభించి వేగంగా ధాన్యం సేకరించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్
- అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా చూడాలని వినతి



మాట్లాడుతున్న పల్లపు వెంకటేశ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కొనుగోలు కేంద్రాలను ఎక్కువ సంఖ్యలో ప్రారంభించి ధాన్యం సేకరణ వేగంగా చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రైతు సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ముందస్తుగా వారి నాట్లు ఉమ్మడి వర్ని, కోటగిరి, బోధన్ మండలాల్లో వేస్తారని అన్నారు. మండలాల్లో వరి కోతలు కూడా ముందస్తుగా ప్రారంభమైందని, ఇప్పటికే ప్రైవేటు వ్యాపారస్తులకు క్వింటాల్‌కు 1900 కాడికి అమ్ముకుంటు న్నారని అన్నారు. రైతులు ఆరుగాలము కష్టపడి పంట పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన తొందరగా కొనుగోలు కాక రైతులు ఏ సమయంలో వర్షం వస్తదో అని ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా యాసంగి పంట ఎండకు ఆరబెట్టినప్పటికీ అకాల వర్షాల వల్ల పంట అంతా రోడ్డు పాలు అయిందని అన్నారు. ఈ సంవత్సరం కూడా వర్షాలు పడే అవకాశం ఉందని ఇప్పటికే వరి కోతలు ముమ్మరమైనయని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి రైస్‌మిల్‌కు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కొనుగోలు కేంద్రాలతో పాటు లారీలు గోనె సంచులు హమాలీల సమస్య లేకుండా చూడాలని రైతులకు తరుగు లేకుండా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వానకాలం పంటలకు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ముందస్తుగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 50వేల క్వింటాలు వడ్లు కొనుగోలు చేశామని రేపటి నుండి ఇంకా కొనుగోలు కేంద్రాలు వేగవంతం చేస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో వడ్లు 17 శాతం తేమ ఉన్న కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవనూరు రాజన్న, రైతు సంఘం నాయకులు శంకర్, శకుంతల, నవీను, మేతరి నారాయణ, హబీబ్, బాలయ్య, సురేసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుంచి చివరి 'తడి'

- సాగునీటిని వృథా చేయొద్దు : ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాసరావు గుప్తా
- 9వ తేదీన ఉదయం 6 గంటలకు కాలువలకు, ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల నిలిపివేస్తున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

సాగునీటి ప్రణాళిక ప్రకారం కాకతీయ కాలువ, సరస్వతి కాలువ లక్ష్మీ కాలువ, లిఫ్ట్ ఇరిగేషన్‌ల ఆయకట్టు పరిధిలో ఈ నెల 9వ తేదీ వరకు మాత్రమే ఎస్సారెస్పీని చివరి తడిని సాగునీటిని అందజేయ నున్నట్టు ఎస్సారెస్పీ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాసరావు గుప్తా తెలిపారు. 09.04.2025 బుధవారం ఉదయం 6 గంటల వరకు మాత్రమే సాగునీరు ఇవ్వనున్నామని, దీని తర్వాత ప్రాజెక్టు నుండి సాగునీరు ఇవ్వడం ఎట్టి పరిస్థితులలో సాధ్యపడదని తెలపారు. ఇదే చివరి తడి అని అన్ని కాలువల పరిధిలోని రైతులందరూ గమనించాలని సూచించారు. ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని, సాగునీటి వినియోగం తర్వాత ప్రాజెక్ట్‌లో మిగిలే నీటిని నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల్, నిర్మల్ , అదిలాబాద్ జిల్లాలలకు తాగునీటి అవసరాల కోసం వినియోగించుకునే విధంగా సహకరించాలని రైతులందరికీ కోరారు. కాకతీయ కాలువ లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందువల్ల, కాలువ దరిదాపుల్లోకి సామాన్య ప్రజలు ఎవరూ రావద్దని , ప్రమాదానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో బీసీల పోరుగర్జనలో పాల్గొన్న జిల్లా వాసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నినదించిన మేమెంతో మాకు అంత వాటా అనే నినాదంతో నేడు (ఏప్రిల్ 2న) ఢిల్లీలో బీసీల పోరు గర్జన లో నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్, కొయ్యడ శంకర్, కరిపె రవీందర్, చంద్రమోహన్, శ్రీలత, చంద్రకాంత్, సిరివేణు, సంతోష్, వాల్మీకి నరేష్, మురళి, అజయ్, వాసం జయ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని గుంజిలి గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా మూడవ రోజు మహిళలు లక్ష పుష్పార్చన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు 108మంది మహిళలతో లక్షపుష్పార్చన నిర్వహించారు. సాయంత్ర ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షులు గోపు రంజిత్ కుమార్, గంగయ్యా, కిరణ్, శేఖర్, ఒడ్డేన్న, శంకర్, హన్మండ్లు, శ్రీనివాస్, సాయిలు, మహేష్, రాజు, ప్రసాద్, గంగాధర్, పోశెట్టి, మనోజ్, క్రాంతి యూత్, డార్లింగ్ యూత్, యంగ్ స్టార్ యూత్, ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

నవతెలంగాణ- రెంజల్

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు ఇకనుంచి సన్నబియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మొయినుదన్, జి సాయి రెడ్డి, జావీద్, అగ్గు నారాయణ, సాయిలు, గోజ్జ రమేష్, జగన్మోహన్ రెడ్డి, సిద్ధ సాయిబు, యోగేష్, గోసుల శ్రీనివాస్, సురేష్ , కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి డబ్బులడిగిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కత్తిని చూపించి బెదిరించి డబ్బులు అడిగిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రఘుపతి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నగరంలో మార్చ్ 31న రాత్రి 8 గంటల సమయంలో ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బోధన్ రోడ్డు వద్ద ఉన్నటువంటి దుర్గా వైన్స్‌లో సతీష్ రెడ్డి, కోలం నాగరాజు వైన్ షాప్‌లో మద్యం అమ్ముతుండగా అదే సమయంలో హైమద్ పుర కాలనీకి చెందిన షేక్ అల్తాఫ్ వ్యక్తి వైన్స్ వద్దకు పెద్ద కత్తి తీసుకుని వచ్చి నాకు డబ్బులు ఇస్తారా లేదా అంటూ కత్తి చూయించి బెదిరించాడు. మద్యం షాపు కు మద్యం కొనుగోలు చేయడానికి వచ్చిన వారిని కూడా కత్తితో బెదిరించాడు. గంగస్థాన్-2కు చెందిన పసునూరి విశ్వక్ కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పాత నేరస్తుడు అయిన షేక్ అల్తాఫ్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై గతంలో ముద్కేడ్ పోలీస్ స్టేషన్, మహారాష్ట్ర యందు హత్య నేరం నమోదు చేయబడిందని, జైలుకు పోయి వచ్చిన ఇతని ప్రవర్తనలో మార్పు రాక పోగ మళ్ళీ నిజామాబాద్‌లో కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్ చేసాడు అని తెలియజేశారు. నగరంలో ఎవరైనా ఎంతటి వారైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తక్షణమే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రకృతి సంరక్షణే నిజమైన అభివృద్ధి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రకృతి సంరక్షణే మన నిజమైన అభివృద్ధి అని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లోని 400 ఎకరా లలో ఉన్న అటవీ ప్రాంతాన్ని వేలం వేసే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలి అని సామాజిక వేత్త, వ్యవస్థాపక అధ్యక్షులు అక్షిత ఫౌండేషన్ సన్నీ కుమార్ రాపాక తెలి పారు. ఆందోళనలో అరెస్టు చేసిన విద్యా ర్థులను వెం టనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూ భూముల నుంచి బుల్డోజర్లను వెనక్కి పిలిపించాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల నుండి తక్షణమే బుల్డోజర్లను వెనక్కి పిలిపించాలని, విద్యార్థులపై పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం. ఎం.సుధాకర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో అనేక రకాల వృక్షాలకు జంతువులకు పర్యావరణానికి నిలయంగా ఉన్న భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరైంది కాద న్నారు. తక్షణమే చెట్ల తొలగింపు ప్రక్రియను ఆపేసి, విద్యార్థులపై నిర్బంధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కేగణేష్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, టియుసిఐ జిల్లా నాయకుడు ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనతో దిగివచ్చిన అధికార యంత్రాంగం

- పైప్‌లైన్ మరమ్మతులు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరణ



మరమ్మతులు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామపంచాయతీ ముందు ఖాళీ బిందేలతో మంగళవారం జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డుపై గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో అధికార యంత్రాంగం స్పందించింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంత్ రావు, ఎంపిఓ రాజ్ కాంత్ రావు, మిషన్ బాగిరథ ఏఈ దిప్ చంద్, గ్రీడ్ ఏఈ, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తిరునగరి శ్రీధర్, ధర్మవరం సింగోటం తండాలో తాగునీటి సమస్యపై ఆరా తీశారు. గత కొన్ని రోజులుగా సర్వీస్ రోడ్డు గుండా కామారెడ్డి పట్టణానికి తాగునీరు అందజేయడానికి నూతనంగా గ్రీడ్ వారు పైప్ లైన్ వేస్తుండటంతో పలుచోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, పనులు డ్యామేజ్ అయ్యే చోట గ్రీడ్ వారు సరిచేస్తున్న గంగారం తండా, తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పలు నివాస గృహాలకు మిషన్ బాగిరథ నీరు రావడం లేదన్నారు. బుధవారం చేడిపోయిన చోట సరిచేసి సాయంత్రం వరకు తాగు నీరు అందజేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇదే కాకుండా నివాస గృహాల మధ్య ఒక బోరు ఫ్రెషింగ్ చేస్తే దాదాపు 20 నివాస గృహాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని కాలనీ వాసులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంత్ రావు దృష్టికి తీసుకుని వచ్చారు. వెంటనే సదరు బోర్‌ను ఫ్రెషింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి అదేశించారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని సూచంచారు. వీరి వేంట కారో బార్లు పిల్లి నరేందర్, శ్రీనివాస్, మిషన్ బాగిరథ, గ్రీడ్ అదికారులు ఉన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి రాచరిక వ్యవస్థలోని దౌర్జన్యాలను ఎండగడుతూ, సర్వాయి పాపన్న గౌడ్ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నులు లేని వ్యవస్థను నెలకొల్పి గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులు ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, సి.గంగాధర్, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ గౌడ్, గౌడ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారయ్య గౌడ్, నాయకులు చెరకు లక్ష్మణ్ గౌడ్, రత్నాకర్ గౌడ్, తాళ్లపల్లి రాజా గౌడ్, సేపూరి సుమన్ గౌడ్, నాగరాజు గౌడ్ బండి సాయా గౌడ్ మాజీ కార్పొరేటర్ ఉమా శ్రీనివాస్ గౌడ్, అధిక సంఖ్యలో గీత వృత్తిదారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



నివాళులర్పిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నకు నివాళులు

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నగరంలోని వినాయక నగర్ లో గల సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. 17వ శతాబ్దంలో సాధారణ కల్లుగీత కార్మిక గౌడ కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న ఆనాటి మొగలు సామ్రాజ్యవాదులకు తొత్తులుగా పనిచేస్తున్న తెలంగాణ దొరలు, భూస్వాములు, జాగిర్దారులు, జమీందారులు వీళ్ళందరి అరాచక పాలనలో అణిగిమనిగి బానిసల్లా జీవిస్తున్న ప్రజల జీవితాలను చూసి చెలించి తన పదిమంది ప్రియ మిత్రులతో కలిపి బహుజనులందరినీ సైన్యం గా తయారుచేసి ఏడు సంస్థానాలని ఆక్రమించి గోల్కొండ ఖిల్లాను రాజధానిగా చేసి తెలంగాణను పరిపాలించిన మొదటి తెలంగాణ విప్లవ వీరుడు సర్వాయి పాపన్న అని అన్నారు. 315వ వర్ధంతి ఉత్సవాలని ఘనంగా నిర్వహించుకుంటున్నాము. ఇది ఏ కులమతాలకు సంబంధం లేకుండా చేసిన పోరాటం అని, వక్రీకరించి చెబుతున్న కొన్ని పార్టీల వాళ్ల తెలుసు కోవాలని సూచించారు. 'ఏ లక్ష్యంతో నైతే సర్వాయి పాపన్న విప్లవపంథాని ఎంచుకొని పోరాటం చేశాడో ఇప్పుడు కూడా అదే లక్ష్యంతో సమాజంలో నెలకొన్న బూర్జువా, భూస్వామ్య, బడపెట్టుబడతారులకు కొమ్ము కాస్తున్న పాలకులకు వ్యతిరేకంగా ప్రజలని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి ఒక్కరూ జయంతికి, వర్ధంతికి పూలమాలు వేసి మహానాయకులకు కులాన్ని ఆపాదిస్తున్న వైనం బాధను కలిగిస్తుందని అన్నారు. కానీ ఏ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారో.. అదే దోపిడీని కొనసాగిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారు. అందుకొరకు మరొక తెలంగాణ స్వతంత్ర పోరాటాన్ని నిర్వహించాల్సిన బాధ్యత సర్వాయి పాపన్న మరణం మనకు చూపిస్తున్నది. 1710లో మొగల్ సామ్రాజ్యవాదులు.! ఇలాగే సర్వాయి పాపన్న లాంటి విప్లవకారులు ఉద్భవిస్తే మా సామ్రాజ్యమే కూలిపోతుందని భావించిన వాళ్లు కుట్రతో, కుతంత్రాలతో వెన్నుపోటు పొడిచి ఆయన తలని నరికి తీసుకెళ్లిన దుర్ఘటనని మనం ఈరోజు గుర్తు చేసుకుంటున్నాం. తెలంగాణలో సర్దార్ సర్వాయి పాపన్న, మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ ల పోరాటం సమకాలం. అందుకోసం నివాళులర్పించడంతోటే సరిపోదు. ఆయన ఆశయాలని తీసుకొని బహుజనులు అందరిని ఏకం చేసి పోరాటానికి సిద్ధం కావాలని' పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికరికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌడ గీత కార్మిక సోదరులందరి తోపాటు ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు, జిల్లా నాయకులు కోయెడ నర్సింలు, సిదుకు శేఖర్ గౌడ్, కిషన్ గౌడ్, పెంట గౌడ్, అంబటి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందుకున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్/డిచ్‌పల్లి

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కేంద్రం సమీపాన హైదరాబాద్ మార్గంలో గల బోర్గాం(పి) గ్రామానికి చెందిన శ్రీ శృంగేరి శారదాపీఠ అనుబంధము గల లక్ష్మీ గణపతి మహాలయములో మంగళవారం రాత్రి ఆధ్యాత్మిక కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు భీంగల్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్, సమ్మేళనంలో పాల్గొని "యుగయుగాల ఉగాది" కవితా శీర్షికన తమ కవితను పఠించి సభికులను అలరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్, కంకణాల రాజేశ్వర్‌కు శాలువా కప్పి ఆత్మీయ జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ టి.అరుణ్ కుమార్ శర్మ, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, చింతల శ్రీనివాస్ గుప్తా, ప్రముఖ కవులు డాక్టర్ బలాష్ట్ మల్లేష్, కె.వి.రమణాచారి తదితరలు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: పురస్కారం అందుకుంటున్న ఆరోగ్య విస్తరణ అధికారి



భీంగల్ రూరల్: కంకణాల రాజేశ్వర్

ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ కు ఉగాది కవి పురస్కారం

డిచ్‌పల్లి: ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణ అధికారిగా పనిచేస్తున్న యెనుగందుల శంకర్ కు ఉగాది కవి పురస్కారం లభించింది. నూతన తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా నిజామాబాదులోని లక్ష్మీ గణపతి ఆలయంలో జరిగిన కవి సమ్మేళనంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కర కమలములచే ఉగాది పురస్కారాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త డాక్టర్.టి. అరుణ్ కుమార్ శర్మకాసర్ల నరేష్ రావు పాల్గొన్నారు.

పేదలకు సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం

నవతెలంగాణ-భీంగల్ రూరల్



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చారిత్రాత్మకం అని కాంగ్రెస్ మండలాధ్యక్షులు బోధిరె స్వామి తెలిపారు. భీంగల్ మండలం దేవన్ పల్లి, పల్లికొండ, ముచ్కూర్, బడా భీంగల్, గోన్ గొప్పుల గ్రామాలలో సన్నబియ్యం పంపిణీ పరిశీలించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోగా.. కార్డులో వున్నా వాళ్ళ పేర్లు తొలగించినట్టు తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం తొలగించిన వారి పేర్లను, పథకానికి అర్హులైన వారి పేర్లను జత చేసి వారికి సైతం సన్నబియ్యం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎం. రాములు, గ్రామ వీడీసీ బొడ్డు చిన్న గంగారం గ్రామ యువ కాంగ్రెస్, నాయకులు ఎం. సంతోష్ నాయక్, గ్రామ అధ్యక్షులు రమేష్, మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కరిపే రమేష్, బొడ్డు సుదర్శన్, ఎం లింబాద్రి, లక్ష్మి, బుచ్చయ్య రాజ గంగారం తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో 'ఆటిజం'పై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక మారుతి నగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ వారి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవితేజ పాల్గొని మాట్లాడారు. ఆటిజం అనేది ప్రతి 4,000 మంది పిల్లల్లో ఒకరికి వస్తుందని దీనిపై ఎన్నో అధ్యయనాలు జరిగినప్పటికీ ఆటిజం పిల్లలు ఏ కారణం వల్ల పుడతారో తెలవలేదని కానీ చాలామంది చాలా విధాలుగా అపోహలు పడతారని అన్నారు. ఆటిజం పిల్లల్లో కొంతమందికి నార్మల్ ఆక్టివ్ ఉంటుందని కానీ వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలో తల్లిదండ్రులకు అవగాహన లేదని చాలా చాలామంది ప్రముఖ వ్యక్తులను చూసినట్లయితే ఆల్బర్ట్ ఐన్స్టీన్, స్టీవ్ జాబ్స్, ఎలన్ మాస్క్, అబ్రహం లింకన్ లాంటి ప్రముఖ వ్యక్తులు ఆరిజం బారిన పడినప్పటికీ ఉన్నత శిఖరాలను చేరుకోగలిగారని కానీ ఇలాంటి పిల్లలకు ఎలాంటి శిక్షణ ఇచ్చినట్లయితే అభివృద్ధి చెందుతారో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డాక్టర్ రవితేజ తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన డాక్టర్ వికాస్ మానసిక వైద్య నిపుణులు మాట్లాడుతూ.. ఆరిజం పిల్లల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన, అది నేర్చుకో ఇది నేర్చుకో అలా ఉండాలి ఇలా ఉండాలి అని ఒత్తిడికి గురి చేయొద్దని, ఈ ఒత్తిడి వల్ల వారు నేర్చుకోలేకపోతారని తెలిపారు. నార్మల్ పిల్లలు నేర్చుకున్నంత స్పీడ్‌గా మీరు నేర్చుకోలేరని వీళ్ళకి రిలాక్స్ మూడ్‌లోనే శిక్షణ ఇవ్వాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్.సిద్దయ్య మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి లోకల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బాబా గౌడ్, స్నేహ సొసైటీ కార్యవర్గ సభ్యులు వీరేశం పాల్గొన్నారు. అంధ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి సిద్దయ్య

అట్టడుగులకోసం పోరాడిన ధీశాలి సర్వాయి పాపన్న



నివాళులర్పిస్తున్న కౌడిన్య యువజన సంఘ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో స్థానిక కౌండిన్య యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్ర పటానికి గౌడ సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌండిన్య యువజన సంఘం అధ్యక్షులు బుర్ర నరేష్ గౌడ్ మాట్లాడుతూ సింహాసనం మొక్కితే రాదు ఎదురు వెళ్లి ఢీకొట్టి నిలబడితే వస్తుందని చాటి చెప్పిన అగ్గిపిడుగు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడానికి చివరి శ్వాస వరకు పోరాడిన ధీశాలి, బహుజనుల ఆత్మగౌరవ రక్షణకు రాజ్యాధికారమే సమాధానమని విశ్వసించి పోరాడిన యోధుడన్నారు. కార్యక్రమంలో స్థానిక గౌడ సంఘం అధ్యక్షులు పెద్ది శంకర్ గౌడ్, మండల అధ్యక్షులు ఉత్కమ్ గంగాధర్ గౌడ్, మండల యువజన సంఘం అధ్యక్షులు అరెల్లి నవీన్ గౌడ్, గౌడ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

- బోధన్ ఏసిపి వెంకటేశ్వరావు

నవతెలంగాణ-వర్ని

దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలతో అమాయక ప్రజలు డబ్బులు పోగొట్టుకొని ఇబ్బం దులు పడుతున్నారని, సైబర్ నేరాల కేసులు రోజు రోజుకు వందల సంఖ్యలో పెరుగుతు న్నాయని ఏ సి పి వెంక టేశ్వరావు అన్నారు. అవగాహన కలిగి ఉంటేనే సైబర్ నేరాలను అరికట్టగలమని అన్నారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో మ్యాట్రిక్స్ స్కూల్‌లో అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైబర్ నేరాగాళ్ళు ఫోన్ చేసి మోస పూరిత మాటలు చెప్పి ఓటీపీ వస్తుంది చెప్పండి అని, ఇతర మాటలతో వ్యక్తుల ఖాతాలో డబ్బులు ఖాళీ చేస్తుంటారని, ఇలాంటి మోసలకు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు గుర్తు తెలియని ఫోన్ నంబర్లు వస్తే లిఫ్ట్ చేయకూడదని తెలుపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏసిపి

కమ్యూనిటీ హాల్ నూతన భవన ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయత్ నగర్ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి పాల్గొనగా, ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ విశిష్ట అతిథిగా విచ్చేసి నూతన భవనానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన హనుమాన్ యూత్ సభ్యులందరినీ అభినందిస్తూ వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఫౌండేషన్ తరపున తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అన్నారు . ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్ కొండి రామచందర్ రాంప్రసాద్ మాజీ కౌన్సిలర్ గంగా మోహన్ , చక్రు నూకల శేఖర్ విట్టోబ శేఖర్ రవీందర్ రెడ్డి కర్త నవీన్ శ్రీకాంత్ గౌడ్ నారా గౌడ్ బిజ్జు మహేందర్ విద్యా స్కూల్ గోపి జిమ్ రాఘవ గంగ మోహన్ ఓం ట్రేడర్స్ చెన్న చందు, ఐరన్ మర్చంట్ జీవన్, భవాని శ్రావణ్ రాజేశ్వర్ గౌడ్ ఫైన్ అబ్రాడ్ సీఈఓ సైఫ్ ముజాహిద్ ఇస్తా కుద్దిన్, ఫౌండేషన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ 10వ తరగతి , ఇంటర్మీడియట్ ల పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ జిల్లా వివిధ శాఖల అధికారులకు పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరగాలని ఏర్పాట్లు అందుకు అనుగుణంగా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు పోస్టల్ అధికారులు మెడికల్ అండ్ హెల్త్ అధికారులు, డిస్టిక్ ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు తదితరుల్ను హాజరయ్యారు.

హనుమాన్ స్వాములకు భిక్ష


భిక్షలో పాల్గొన్న స్వాములు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయంలో పట్టణానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పురాం రాజమౌళి కుటుంబ సభ్యులు హనుమాన్ మాల స్వాములకు భిక్షా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆలయంలో పురాం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హనుమాన్ మాల స్వాములు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

హంగర్గా ఫారంలో వరి కొనుగోలు షురూ


కొనుగోలు ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హంగర్గా ఫారంలో వరి కొనుగోలు బుధవారం మొదలైనది. ఎనిమిది వరి కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం నడిపిస్తుండగా, నాలుగు కేంద్రాలను మహిళా సంఘాలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపిన నుంచి రైతులలో ఆందోళన మొదలైంది. కొనుగోలులో వేగం పెంచాలని, అవసరమైతే పట్టాలను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

సన్న బియ్యం పథకం పేదలకు వరం


నిజాంసాగర్: సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు


పిట్లంలో..


రామారెడ్డిలో..

- **మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్**

నవతెలంగాణ-నసురుల్లాబాద్

సన్న బియ్యం పేదల పాలిట ఓ వరమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మైలారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. త్వరలోనే నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో 17 గ్రామ పంచాయతీలకు 15 రేషన్ దుకాణాలు ఉండగా 7274 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 23,360 మంది లబ్ధిదారులు ఉండగా మండలానికి 1219 క్వింటాళ్ల బియ్యం పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, సొసైటీ అధ్యక్షుడు హనుమంత్‌రావు, గ్రామ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జంగంపల్లిలో సన్న బియ్యం పంపిణీ

భిక్కనూర్ : మండలంలోని జంగంపల్లి గ్రామంలో రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదలకు సన్నబియ్యం అందాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు నరేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ తనిఖీ

మద్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టింది. దాంట్లో భాగంగా మండలంలోని వివిధ రేషన్ షాపులలో పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ తనిఖీ చేశారు. ప్రజలకు సరఫరా చేస్తున్నా తీరును పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఎలాంటి సమస్య రాకుండ సక్రమంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. తనిఖీలో మండల గిర్దావర్ ఎం.శంకర్ ఉన్నారు.

సన్నబియ్యం పథకం దేశానికే గర్వకారణం: సింగిల్ విండో చైర్మెన్..

పిట్లం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ దేశానికే గర్వ కారణమని చిన్నకొడప్‌గల్ సింగిల్ విండో చైర్మన్ నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారెంటీ పథకాలను కొనసాగిస్తూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసిబి డైరెక్టర్ చింతల సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సాయినాథ్, సొసైటీ డైరెక్టర్ గంగారెడ్డి, పంచాయతీ సెక్రెటరీ ఋకష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : సన్న బియ్యం పేదలకు ఒక వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు ఏలే మల్లికార్జున అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రేషన్‌షాప్‌లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పేద ప్రజల కోసం సన్నబియ్యం పంపిణీ చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు అనీస్ పటేల్, సత్య గౌడ్, వసుల రాములు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని రెడ్డిపేటలో లబ్ధిదారులకు సన్న బియ్యం కార్యక్రమాన్నిమండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధన్సింగ్, కుమ్మరి శంకర్, చిన్న రాజయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహావిష్కరణకు తరలి రావాలి

- **ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు భాగయ్య**


గైని శివాజీని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

సదాశివ్‌నగర్ మండల కేంద్రంలో నేడు జరిగే మహనీయుల విగ్రహావిష్కరణకు మండలంలోని ఆయా గ్రామాల బహుజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య తెలిపారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గురువారం సదాశివనగర్ మండల కేంద్రంలో మహనీయుల విగ్రహావిష్కరణ జరిగే కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగర్తి ప్రీతంలు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బహుజన నాయకులు, కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎల్లారెడ్డి నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఎన్నికైన గైని శివాజీని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజురెడ్డి తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో మండల యూత్ ఉపాధ్యక్షులు డి.సంతోష్, ఈ నర్సింలు, మండల ఎస్సీ సెల్అధ్యక్షులు రాజేందర్, కాంగ్రెస్ పార్టీకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు



నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంతో పాటు పోతంగల్ కాలన్ గ్రామంలో రెండు కేంద్రాలలో 10వ తరగతి పరీక్షలు నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాంధారి సెంటర్‌లో మొత్తం 247 మంది గాను ఒకరు గైర్హాజరయ్యారు. పోతంగల్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో మొత్తం 130 గాను మొత్తం హాజరయ్యారు. ఈరోజుతో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు వీటిని విజయవంతంగా నిర్వహించిన సిఎస్, డివోలకు, ఇన్విజిలేటర్స్, సహకరించిన పోలీస్, వైద్య ఆరోగ్య సిబ్బందికి మండల విద్యాధికారి శ్రీ వుడాపల్లి శ్రీహరి అభినందనలు తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులకు, వివోఏలకు ఐకేపీ సిబ్బందికి వరి ధాన్యం కొనుగోలు గురించి అవగాహన బుధవారం కల్పించారు. సీఎం ఆదేశానుసారంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో ఐకేపీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మండలంలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, ఐకేపీ ఎపియం జగదీష్ కుమార్, సీసీలు, ఆయా గ్రామాల సంఘాల కమిటీ సభ్యులు, వివోఏలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ప్రధాని ఫోటో, కేంద్రం అందిచేవాటా పెట్టాలి

- **ఓబీసీ మోర్చా అధ్యక్షులు ముదాం దత్తాత్రేయ**

నవతెలంగాణ-తాడ్వాయి

రేషన్ షాపుల్లో మోడీ ఫోటో, కేంద్రం అందించేవాటా ఫ్లెక్సీలతో పెట్టాలని మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు ముదాం దత్తాత్రేయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సరుకులకు అందజేసే కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల వాటా తెలియజేసి ఫ్లెక్సీలు మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందజేసే వాటా పేద ప్రజలకు తెలియకుండా పోతుందని, తక్షణమే ఫోటోతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ప్రకటనలలో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ-ఎడపల్లి

గత నెల 21న ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 2న ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని జానకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో, మండల కేంద్రంలోని తెలుగు మీడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం, ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 380 మందిగాను ఇద్దరు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి శివలింగ్ గాలప్పా తెలిపారు. పరీక్షలు సజావుగా సాగేందుకు సహకరించిన పోలీస్ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో పత్రికలే కీలకం

- **తహసీల్దార్ ధన్వాల్**

నవతెలంగాణ-ఎడపల్లి

పస్తుత తరుణంలో ప్రజా సమస్యలను వెలికి తీసి నిర్భయంగా నిర్దిష్టంగా వార్తలు సేకరించి అధికారుల దృష్టికి తేవడంలో పత్రికలు ఎంతో దోహద పడతాయని తహసీల్దార్ గన్వాల్, ఎంపీడీవో శంకర్, ఎస్సై వంశీకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం లోకం తీరు క్యాలెండర్‌ను అధికారులు ఆవిష్కరించారు. పోటీ ప్రపంచంలో పత్రికలన్నీ సమానమేనని అధికారులు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న, అధికారుల పర్యవేక్షణ తోపాటు, అభివృద్ధి పనులను నిర్భయంగా రాసేదే పత్రికలు అన్నారు. లోకం తీరు పత్రిక దినదిన అభివృద్ధి మరింత చెందాలని అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక మండల లోకం తీరు విలేఖరి కందునూరి గంగ శంకర్ ఉన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నివాళి


నివాళులర్పిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, తదితరులు

నవతెలంగాణ-కామారెడ్డి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ విక్టర్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న వరంగల్ జిల్లాలో జన్మించినట్టు భువనగిరి స్థానంగా ఎన్నో పోరాటాలు చేసి సమ సమాజ స్థాపన కోసం, బడుగు, బలహీన అభ్యున్నతికి పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. గౌడ సంఘ ప్రతినిధులు, ఇతర సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ చందర్ నాయక్, నరేష్, పవన్, స్వప్న, సునీత, రాజేశ్వర్, గౌడ సంఘ నాయకులు రాజాగౌడ్, తిరుమల గౌడ్, కల్లుగీత కార్మిక సంఘ నాయకులు, మహేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దు

- **మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల**


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మైలారం గ్రామ సొసైటీ అధ్యక్షుడు హనుమంత్‌రావు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, మాజీ ఏఎంసీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల మాట్లాడుతూ.. ఆరుగాలం పండించిన పంటను నాణ్యమైన మద్దతు ధర, సకాలంలో డబ్బులు అందే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించే క్వింటాల్ ధాన్యం గ్రేడ్ (ఎ) రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా నిర్ణయించినట్టు తెలిపారు. నింబంధనల ప్రకారం రైతులు నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి విక్రయించాలని కోరారు.

నసురుల్లాబాద్ సహకార సంఘం ఆధ్వర్యంలో హాజీపూర్ నసురుల్లాబాద్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ అధ్యక్షుడు గంగాధర్ ప్రారంభించారు. అలాగే మిర్జాపూర్ సహకార సంఘం పరిధిలో అన్నారం గ్రామంలో చైర్మన్ రాంబాబు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు కంది మల్లేష్, మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, కార్యదర్శులు నరేందర్, శ్రీనివాస్ జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలను జయప్రదం చేయండి

- **షెడ్యూల్ ప్రకటించిన మండల పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు**



నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు మండలంలో చేపట్టబోయే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలను ప్రతి గ్రామంలో విజయవంతం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మండల పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు అన్నారు. బుధవారం గ్రామాల వారిగా చేపట్టే పాదయాత్ర షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు.

పాదయాత్ర షెడ్యూల్...

3న చిన్న షక్కర్గా, సలాబత్పూర్, కేలూర్, 4న తడి ఇప్పర్గా, గోజేగావ్, మేనూర్, శాఖాపూర్, 5న సుల్తాన్ పేట్, లచ్చన్, రూసేగావ్, రాచూర్, 7న పెద్ద ఎక్లారా, ధనూర్, సోమూర్, 8న చిన్న తడగూర్, పెద్ద తడుగూర్, ఖరగ్, ఆవల్గావ్, 9న చిన్న ఎక్లారా, కొడిచరా, ఈ విధంగా నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలకు ప్రతి గ్రామంలో విజయవంతం కావడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రామ్ పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, కొండ గంగాధర్, బండి గోపి, పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు..

కాంగ్రెస్ పార్టీ ఐకమాండ్ పిలుపుమేరకు మండలంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్రలు చేపట్టేందుకు మండల పార్టీ నాయకులు కార్యకర్తలు, సిద్ధమైనట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దరాస్ సాయిలు తెలిపారు. బుధవారం రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు కలిసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ రామ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడులు పొందండి

- **సహకార సంఘం అధ్యక్షుడు మిద్దె నరేందర్**
- **జానకంపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**



నవతెలంగాణ-ఎడపల్లి

రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళాలకు విక్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి అధిక దిగుబడులు పొందాలని సహకార సంఘం అధ్యక్షుడు మిద్దె నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని జానకంపేట గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అధ్యక్షులు మిద్దె నరేందర్, మండలస్థాయి అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మిద్దె నరేందర్ మాట్లాడుతూ.. రైతులకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ప్రకటించినట్లయితే మద్దతు ధరతో పాటు క్వింటాల్కు రూ.500 బోనస్‌ను అందిస్తుందన్నారు. రైతుల ఫేసును కోర్టు ప్రభుత్వం (ఏ) గ్రేడ్ ధాన్యానికి రూ.2320, (బి) గ్రేడ్ ధాన్యానికి రూ.2300 రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్వాల్. ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు సహకార సంఘం కార్యదర్శి గంగారెడ్డి సిబ్బంది నరసయ్య, సహకార సంఘం పాలకవర్గంతో పాటు %శ్రీ% రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సొసైటీ పరిధిలోనే కొనసాగించాలి

- **గ్రామస్తుల వినతి**


వినతి అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్‌పేట్ ధాన్యం కొనుగోలు కేంద్రం సొసైటీ పరిధిలోనే కొనసాగించాలని గ్రామస్తులు తెలిపారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా గోపాల్‌పేట్ ధాన్యం కొనుగోలు కేంద్రం సొసైటీ పరిధిలోని కొనసాగుతుందని కొత్తగా ఐకెపి పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని కేటాయించడాన్ని నిరసిస్తూ వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించినట్టు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వంశీ గౌడ్, ఫరీద్, మచ్చేందర్, సాయిలు, రవి, సాకలి సాయిలు, వివేక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌కు భారీ స్పందన


ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతిజ్ఞ చేసి బుధవారం 3వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరిస్తూతుంటే ప్రజలనుంచి మంచి స్పందన వచ్చిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావ్ అన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కారంగుల అశోక్ రెడ్డి, మైనార్టీ సెల్ సిరజ్, వార్డు మాజీ కౌన్సిలర్ పోదర్ల రాజు, పిడుగు మమత సాయిబాబు, మాజీ కౌన్సిలర్ కన్నయ్య తెజాపు ప్రసాద్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర..

ఎడపల్లి : జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని మండలంలోని నెహ్రూనగర్, జానకంపేట, గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వతంత్రం కోసం పోరాడిన మహనీయులు, జాతీయ నాయకుల చిత్రపటాలను జాతీయ జెండాలతో నాయకులు గ్రామాలలోని ప్రధాన వీధులలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పథకాలపై ప్రచారం నిర్వహించారు. రానున్న రోజుల్లో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నాయకత్వం చేశారు. దేశంలో ఎక్కడలేని సంక్షేమ ఫలాలు అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతున్నట్టు నాయకులు గుర్తు చేశారు. పక్షం రోజులపాటు కేడిపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో జై బాబు, జై భీమ్ కార్యక్రమాలు, పాదయాత్ర చేస్తూ ప్రజల మధ్యలోకి వెళ్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల ఇన్చార్జి నగేష్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటీ లింగం, బోధన్ వేసే మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరటూరి సత్యనారాయణ చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌గా చేసిన వారితో

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : ఏఐటీయూసి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్మెంట్ సంబంధం లేని వారితో ఫార్మసీలో బీఫార్మసీ, డి ఫార్మసీ చేసి యునాని, ఆయుర్వేదంలో ఎలాంటి అనుభవం లేని వారితో ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుష్ రంగంలో డిప్లమా కోర్సులు ప్రవేశపెట్టి రెండు సంవత్సరాలు శిక్షణ ఇచ్చి నైపుణ్యం పొందిన, చదువుకున్న వారిని ఉద్యోగంలో భర్తీ చేయడం ద్వారా సరైన మందులు ఇస్తారని తెలిపారు. కానీ అనుభవం లేని అయుర్వేదంతో సంబంధం లేనివారిని రిక్రూట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గతనెల 28 జీవో-65 ఇచ్చి గౌరవ ఆరోగ్యశాఖ ఉత్తర్వులు ఇవ్వడం సరైందని కాదని పేర్కొన్నారు. కాదని ఆ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

10, 260 నగదు, 4 సెల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని రాజరాజేశ్వరి నగర్ గ్రామ పరిధిలోని భీముని గుడి వద్ద పేకాట స్థావరంపై దాడి చేసి నాలుగురు పేకాటరాయిలను అరెస్టు చేసినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి బుధవారం తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఆయన తెలిపారు. పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.10వేల 260, 4 సెల్ ఫోన్ లను, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. పట్టుకున్న నాలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ జల్సాలు, సరదా కోసం పేకాడుతూ కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. పేకాట మూలంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని, పేకాట ఆడితే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సాగునీటి విషయంలో ఘర్షణ

ఒకరిపై గొడ్డలితో దాడి

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని అబ్బాపూర్ (బి) శివారులో సాగునీటి విషయమై అదే గ్రామానికి చెందిన నేనావత్ రవి మరియు సభావత్ శివరాం ఆయన కుమారుడు సురేష్ ల మధ్య ఘర్షణ జరగగా గొడ్డలితో రవిపై దాడి చేసినట్లు ఎస్సై వినయ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం అబ్బాపూర్ తాండ గుండ్ల చెరువు కాలువ నీటితో నింపారు. పంటలకు సాగునీరు అవసరం ఉండడంతో చెరువు తూములేపి పంటలకు సాగునీరు విషయంలో వివాదం చోటు చేసుకోగా ఉద్దేశపూర్వకంగా తండ్రి కొడుకులు ఇద్దరు కలిసి గొడ్డలితో నేనావత్ రవిపై దాడి చేయగా తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు.


కమ్మర్‌పల్లిలో..


ముప్కాల్: రెంజర్లలో..


ఏర్గట్లలో..మాట్లాడుతున్న నాయకులు

రెంజల్ ఎస్సైగా కె. చంద్రమోహన్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-రెంజల్



రెంజల్ ఎస్ఐగా కే.చంద్రమోహన్ బుధవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఈ సాయన్న ఆదిలాబాద్ బదిలీ కాగా, ఆయన స్థానంలో చంద్రమోహన్ బాధ్యతలను తీసుకున్నారు. ట్రాఫిక్ ఎస్ఐగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో శాంతి భద్రతలను రక్షించడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండలంలోని హాసాకొత్తూర్ గ్రామంలో విజేత యువజన కళా సంఘం ఆధ్వర్యంలో ఉగాది పండుగ పురస్కరించుకుని ఉగాది రోజున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులను ప్రధానం చేశారు. ప్రథమ బహుమతి భవిష్యరాణి, ద్వితీయ బహుమతి శాంతి, తృతీయ బహుమతి శివచరణ్ లకు అందజేశారు. కార్యక్రమంలో విజేత యువజన కళ సంఘం అధ్యక్షుడు బద్దం రవి, సెక్రటరీ పెద్ది నవీన్, వినయ్, నరేష్, రాజేష్, ఉట్నూరి నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

నవతెలంగాణ-బాల్కొండ/ముప్కాల్

కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాల్కొండ మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభి ంచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షులు సంజీవ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యునుస్,అన్వర్, మజరొద్దిన్, డిష్ వెంకటేష్, రవి, రియాజ్, నాయకులు పాల్గొన్నారు.


బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

ముప్కాల్ :మండలంలోని వేంపల్లి గ్రామంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యంను స్థానిక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఉగాది కానుకగా రాష్ట్ర ప్రజలకు రేషన్ ద్వారా పౌష్టికాహారం అందించేలా కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక ప్రతి నెల లబ్ధిదారులకు రేషన్ ద్వారా సన్న బియ్యంను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పొద్దు తిరుగుడు పంట కొనుగోలు

నవతెలంగాణ-మద్నూర్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మద్నూర్ ఆధ్వర్యంలో (మర్కెడ్, నాఫెడ్)ద్వారా గురువారం ఉదయం 10 గంటలకు మద్నూర్ మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు మద్దతు ధర కొనుగోలు కేంద్రం సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన ప్రారంభించనున్నట్లు సింగిల్ విండో కార్యదర్శి జే.బాబురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి సూర్య పూల్ పంట పండించిన రైతుల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని విండో కార్యదర్శి రైతులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

కూలీల సాయంతో పనులు చేపట్టాలి

- డిఆర్‌డిఓపిడి సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

నాగన్న గారి మెట్ల బావిలో కూలీల సాయంతో బావిలోని మట్టిని తీసివేయాలని డిఆర్డిఓ పిడి మండల ప్రత్యేక అధికారి సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చారిత్రక కట్టడమైనటువంటి నాగన్న గారి మెట్ల బావిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మెట్ల బావిలో పూర్తిగా భూగర్భ జలాలు లేకపోవడంతో బావిలో ఉన్నటువంటి మట్టిని తీసివేయడానికి పూడికత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల సాయంతో పూడికత పనులు మట్టిని తొలగించినట్లయితే భూమి లేవత్తు పెరుగుతుందన్నారు. పూడికత వలన భూమి విస్తీర్ణంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. త్వరలోనే ఉపాధిహామీ కూలీల చేత పూడికత పనులను ప్రారంభించాలని ఆయన ఎంపీడీవోకు ఆదేశించారు. అదేవిధంగా నాగన్న గారి మెట్ల బావి వద్ద సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో నరేష్, ఏపీఓ నరేందర్, ఎంపీఓ మల్లారి ఏపీఎం శ్రీనివాస్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గొట్టిముక్కల ఉపకేంద్రంలో గురువారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగుదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు నందిపేట్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిపేట్, మాక్లూరు మండల విద్యుత్ వినియోగదారులు ఏమైనా విద్యుత్‌కు సంబందించిన సమస్యలు ఉంటే విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ నారాయణ, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

- జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్‌లో నాయకులు
- పలుమండలాల్లో ప్రారంభమైన పాదయాత్రలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి:మన దేశ ఉజ్వల భవిష్యత్తు కోసమే జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ నినాదమని కార్యక్రమ కోఆర్డినేటర్, ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో ఏఐసీసీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారచంద్ నాయక్ గ్రామంలో నాయకులతో, కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తూ పాదయాత్ర నిర్వహించారు.గ్రామంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన భారతదేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటుందన్నారు. గత పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి మన రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందామని అందుకే జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ నినాదాలతో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక లక్ష్యాల సాధన కోసం 26 జనవరి 1950 రాజ్యాంగం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రజల భవిష్యత్తు కోసం రాజ్యాంగం ఒక వాగ్దానంగా నిలబడిందన్నారు. అనంతరం ఐడీసీఎంస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్‌ను నాయకులు, కార్యకర్తలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తక్కూరి దేవేందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ రేవతి గంగాధర్, సిరిపురం రవీందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్, కుందేటి శ్రీనివాస్, కొమ్ముల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో జై బాపు..జై బీం.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ చేసి నాయకులు గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పడగల ప్రవీణ్, మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ, గ్రామ శాఖ అధ్యక్షులు రేవతి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి తక్కురి దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లో భాగంగా మండలంలోని తాళ్ళ రాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రను నిర్వహించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారని అన్నారు. మండల మైనార్టీ అధ్యక్షులు మునీరోద్దీన్, నాయకులు రేండ్ల రమేష్, రామగౌడ్, దిబ్బ సుదర్శన్, భాను, ప్రభాకర్, దొబ్బల మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాక్లూర్‌లో..

ముప్కాల్:జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంచిర్యాల గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా రెంజర్ల గ్రామానికి చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజలకు సమాన హక్కులను కల్పించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడుపై ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాక్లూర్: ఆలూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్.. అనే నినాదంతో జరిగిన పాదయాత్రలో గిరిజన స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ కె. తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరణ చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మున్సిపల్ సాయి రెడ్డి, ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, డిసిసి సెక్రెటరీ దేగ పోశెట్టి, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివ, మహేష్, కృష్ణ, వైస్ మల్లరెడ్డి, గంగారెడ్డి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లో జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నగరంలోని 23, 50 డివిజన్లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్దు అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, నరాల రత్నాకర్, బోట్టు రాజేష్, సంతోష్,శేఖర్ గౌడ్, రత్నాకర్, రామ కృష్ణ , రాంభూపాల్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ధ్యేయం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశమని రూరల్ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి అన్నారు .బుధవారం మండలంలోని రామడుగు, కేశారం, మైలారం, చల్లగర్గ, టీబీ తండా, దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభించారు. టీబీ తండాలో సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మారుమూల తండాకు వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఇక్కడి ప్రాంత ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని గ్రహించి ఎన్నికల్లో ఇచ్చిన హామీప్రకారం.. నేడు సబ్‌స్టేషన్ పనులు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. తండాతోపాటు మైలారం, దుబ్బాక, చల్లగర్గ, రామడుగు, కేసారం, రేకులపల్లి గ్రామాల్లో సిసి రోడ్లను ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో తాగునీటికి బోరు మోటార్లు అందించడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో రైతులకు ప్రభుత్వం పోడు పట్టాలు అందించనుందని తెలిపారు. దుబ్బాక లక్ష్మి నరసింహస్వామి ఆలయానికి కోటి రూపాయలతో నిర్మించి రోడ్డుకు ప్రారంభించుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇండ్లు కట్టుకునేవారికి ప్రభుత్వం సహాయం అందించేందుకు కృషిచేస్తుందని అన్నారు. రెండవ విడత భూమి లేనివారికి 75 గజాల స్థలం ఇచ్చి ఇండ్లు కొనుక్కునేందుకు అవకాశం కల్పించనుందన్నారు. స్థలం లేనివారు అధైర్య పడవద్దని అన్నారు. నిరుద్యోగ యువకులు తమ కాళ్లపై తాము నిలబడేవిధంగా రుణాలు అందించడం జరుగుతుందని, ఇందుకు ఆరువేల కోట్లు ఖర్చు చేయనుందని, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. నియోజక వర్గానికి నాలుగు సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని, ఇందులో తిర్మన్ పల్లి, ధర్పల్లి , జక్రాన్పల్లి లకు మంజూరు అయ్యాయని అన్నారు , మరో మూడు సబ్ స్టేషన్లు మంజూరు కానున్నాయని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చేర్మెన్ ముప్పు గంగారెడ్డి , శేఖర్ గౌడ్ , మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, మంగిత్యా నాయక్, సొసైటీ చేర్మెన్ జనార్దన్ రెడ్డి, చెలిమెల నర్సయ్య సుభాష్, మిట్టపల్లి గంగారెడ్డి, మైలారం లింగారెడ్డి, పోతన్న, ప్రతాప్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, గాదె నరేష్, గ్రామ శాఖా అధ్యక్షులు, మండల నాయకులు పాల్గొన్నారు.



జెల్ల మురళి మరణం శ్రామిక వర్గానికి తీరని లోటు

- సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జెల్ల మురళి మరణం శ్రామిక వర్గానికి తీరని లోటు అని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం(బీఓసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జెల్ల మురళి మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. బుధవారం ప్రజల సందర్శనార్థం వారి ఇంటి దగ్గర భౌతిక కాయాన్ని ఉంచారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఏఐకేఎంఎస్ అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ మురళి మరణం కుటుంబ సభ్యులకే కాదు శ్రామిక జనానికి, శ్రమజీవుల అందరికీ తీరనిలోటని అన్నారు . కామ్రేడ్ జెల్ల మురళి నిజామాబాద్ పట్టణంలోని ప్రింటింగ్ ప్రెస్ లో పనిచేస్తూ కార్మికులకు కనీస కూలీ, వేతనాలు ఇవ్వాలని కార్మికులను కూడగట్టడంలో సంఘం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర వహించారని గుర్తు చేశారు. ప్రింటింగ్ ప్రెస్ మురళిగా జిల్లాలో అందరికీ సుపరిచితుడని అన్నారు. ప్రెస్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసి వారికి కనీస వేతనాలతో పాటు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఉద్యమించి సాధించాడని అన్నారు. మున్సిపల్ కార్మికుల హక్కులు, నగరంలోని ద్వారకా నగర్ గుడిసె వాసుల నివాసాలు కాపాడుకోవడంలో అండగా నిలబడ్డాడని అన్నారు. శ్రామిక నగర్(బోర్గం పి) కాలనీలో వందలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కీలకంగా ఉన్నారన్నారు. శ్రమ జీవుల సంఘం భవన నిర్మాణ కార్మిక సంఘం (బిఓసి) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంతో మంది కార్మికులకు భద్రత కార్డులు ఇప్పించారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ దాసు, జిల్లా అధ్యక్షులు బి భూమన్న , తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, న్యూడెమోక్రసీ డివిజన్, నగర కార్యదర్శులు పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, ఐఎఫ్టీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివకుమార్, సత్యం, రమేష్, భాస్కర్, జేపీ గంగాధర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయి రెడ్డి, పిఓడబ్ల్యు ప్రధాన కార్యదర్శి భారతి, నాయకురాలు లక్ష్మి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు గౌతం, ప్రిన్స్, రైతు నాయకులు నడిపి భూమయ్య, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సిపిఐ నాయకులు, వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయు భూములు అమ్మడం దారుణం

- ఏబీవీపీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో తరగతుల బహిష్కరణ
- రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కి చెందిన 400 ఎకరాల భూముల అమ్మకాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం తరగతులను బహిష్కరించి, యూనివర్సిటీ బంద్‌ను బంద్ చేయించినట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి.శివ తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూముల అమ్మకాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి యూనివర్సిటీ మెయిన్ గేట్ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర చేసి దగ్దం చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. విద్యార్థులు, మేధావులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తూ యూనివర్సిటీ భూములను అమ్మడం దారుణమన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడి అక్కడున్న వన్యప్రాణులను కాపాడి విద్యా వ్యవస్థను బాగు చేయాలని, యూనివర్సిటీలను గాడిలో పెట్టాలని ఆయన కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి కళ్ళు తెరిచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మక నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని విద్యార్థులకు యూనివర్సిటీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృతాచారి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి మర్చిపోయి ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ లాగా వ్యవహరిస్తున్నాడని, ప్రైవేటు వ్యక్తులకు యూనివర్సిటీ భూమిని కట్టబెట్టడం సిగ్గుచేటని అన్నారు. అలాగే ఏబీవీపీ యూనివర్సిటీ అధ్యక్షులు సాయికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులను విద్యకు దూరం చేయాలనే కుట్ర తోటే రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్ముతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ జాయింట్ సెక్రటరీ సమీర్, అశోక్, అజయ్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు అనిల్, పృథ్వి రోహన్, నరేందర్, రమణ, ఉదయ్, సాయి, కౌశిక్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదికి టాటా..ఇంటి బాట

- ముగిసిన పది పరీక్షలు



నవతెలంగాణ-ఆర్మూర్

గత కొన్ని రోజుల నుండి నడుస్తున్న పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. పట్టణంలోని మోడల్ పాఠశాల, బాలికల పాఠశాల మామిడిపల్లి హై స్కూల్‌లతోపాటు మండలంలోని మొత్తం 12 పరీక్ష కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహించారు. బుధవారంతో పదోతరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంతో ఇంటి బాట పట్టారు.

శరవేగంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం

- ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బంగారుపల్లి మోడల్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నాయని ఎంపిడిఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ.. మండలంలోని బంగారుపల్లి గ్రామాన్ని మొదటగా మోడల్ గ్రామంగా ప్రభుత్వం ఎంపిక చేసి ప్రకటించిన విషయం తెలిసిందే.. గ్రామానికి మొత్తం 105 ఇండ్లు మంజూరు కాగా అందులో 30 ఇండ్లు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కొన్ని పునాది దశలో నిర్మాణంలో ఉంటే, ఇంకొన్ని పిల్లర్ లేవల్ వరకు వచ్చాయన్నారు. మిగతా పనులు ప్రారంభిస్తామని లబ్ధిదారులు పేర్కొన్నారని తెలిపారు. మోడల్ గ్రామంలో మొదటగా అభివృద్ధి పరిచి ఒక్కొక్కటిగా మిగతా గ్రామాలకు విస్తరించడం జరుగుతుందన్నారు. వీలైనంతవరకు డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాన్ని తొందరగా కొనసాగించాలని, పూర్తయిన వాటికి విడతల వారీగా ప్రభుత్వం డబ్బులు మంజూరు చేస్తుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం ఏప్రిల్ 03, 2025 www.navatelangana.com

అక్రమ మోటార్లు తొలగింపు

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని అన్నారం గ్రామంలో నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించగా స్థానిక పంచాయతీ కార్యదర్శి సాగర్ తనిఖీ చేశారు. బుధవారం మోటార్లను స్వాధీనం చేసుకొని గ్రామపంచాయతీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అందరికీ నీరు అందేలా ప్రజలు సహకరించాలని, మోటర్లు బిగించి అక్రమంగా నీటిని వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ గ్రామస్తుల నిరాహార దీక్ష

నవతెలంగాణ-రాజంపేట్


నిరాహార దీక్షలో పాల్గొన్న గ్రామస్తులు

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణలకు గురయ్యాయని బుధవారం గ్రామస్తులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అండతో భూములను కబ్జా చేశారని వెంకటేశ్వర స్వామి గుడి, రాజేశ్వర గుడికి సంబంధించిన భూములు కూడా ఆక్రమించుతున్నారు. అందుకే న్యాయం జరిగే వరకు నిరాహార దీక్ష చేస్తానని గ్రామస్తులు తెలిపారు.


రెంజల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సింగిల్ విండో చైర్మన్


మోపాల్‌లో...


ఎడపల్లిలో...


నవీపేటలో...

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరులబృందం

వర్ని : మహిళా సంఘాల (సెర్ప్)వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జలాల్‌పూర్ గ్రామంలో రైతు సామాన్య సమితి అధ్యక్షులు గంగారాం, ఏపిఎం ప్రసాద్ పారంభించారు. ఈ సందర్భంగా ఏపిఎం ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల అభివృద్ధి చెందేందుకు, సంఘాలు మరింత ముందుకు పోవటానికి పేదరిక నిర్మూలాన సంస్థ ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్, సిహెచ్ గంగారాం, మహిళా సంఘాల అధ్యక్షులు, సిసిలు, విఓఏలు, తదితరులు పాల్గొన్నారు

రెంజల్ : మండలంలోని సాటాపూర్, బోర్గం, అంబేద్కర్ నగర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ శ్రావణ్ కుమార్, రెంజల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబీన్ ఖాన్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకెపి ఏపీఎం చిన్నయ్య, స్థానిక నాయకులు జావీద్, ధనుంజయ, జి సాయి రెడ్డి, సాయిబా బా గడ్, ఎంఎల్ రాజు, కార్తీక్ యాదవ్, డ్వాక్రా మహిళలు, స్థానిక యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండల కేంద్రమైన రెంజల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో చైర్మన్ మొయినుద్దీన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరు కాలం కష్టించి పండించిన పంట దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులు విక్రయించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం రైతులకు నష్టపోకుండా బోనస్ సౌకర్యం కూడా కల్పించడం జరిగిందని, దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, పాలకవర్గ సభ్యులు అగ్గు నారాయణ, సాయిలు, ఖదీర్ పాషా, స్థానిక కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, జి సాయి రెడ్డి, జావీద్ ఉద్దీన్, ఎమ్మెల్ రాజు, ఇందిరా, సీఈవో ఇంద్రసేన్, సిబ్బంది కిషోర్, ఎల్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మోపాల్ : మండల కేంద్రంలో సింగిల్ విండో చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయి రెడ్డితో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కచ్చితంగా కొనుగోలు కేంద్రాల్లోనే రైతులందరూ ధాన్యాన్ని విక్రయించాలని, దళారుల నమ్మి మోసపోవదని రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, సొసైటీ డైరెక్టర్లు, సీఈఓ సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు

ఎడపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలకు సాధికారత ఆర్థికంగా లాభాలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి ద్వారా గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులకు కొనుగోలు కేంద్రాలను అప్పగించినట్లు మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శ్రీదేవి, ఐకెపి ఎపిఎం గంగరామ్ అన్నారు. మండలంలోని దుబ్బ తండా, మంగల్ పహాడ్ ధర్మారం, బ్రాహ్మణపల్లి, వడ్డేపల్లి, ఎడపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకెపి అధికారులు, మహిళా సమైక్య సభ్యులు ప్రారంభించారు. ఏ ధాన్యానికి 23 20 రూపాయలు, బి-గ్రేడ్ ధాన్యానికి 2300 ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శ్రీదేవి, కోఆర్డినేటర్లు పాండురంగం, భాస్కర్ సాయిలు, సంజీవ్, రషీద్, మంగళ్ పహాడ్‌లో మాజీ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, వీడిసి కార్యదర్శి చేపూర్ శ్రీనివాస్‌గౌడ్, వీవోఏలు కుమ్మరి పుష్ప, జంగం సంధ్య గ్రామ సంఘం అధ్యక్షులు తక్కెల శ్యామల, అనిత, అబ్బవ్వ, రైతులు లచ్చరెడ్డి, దెగులూరు శంకర్, సుంకరి గంగాధర్ పాల్గొన్నారు.

నవీపేట్ : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని ఏపిఎం భూమేశ్వర్ గౌడ్ అన్నారు. మండలంలోని నాగేపూర్, కోస్లి గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపిఎం భూమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, బి గ్రేడ్ ధాన్యానికి 2300 రూపాయలు ఇస్తుందని రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలని అన్నారు. మహిళా సంఘ కొనుగోలు కేంద్రాలకు రైతులు సహకరించి కొనుగోలు వేగవంతం అయ్యేలా చూడాలని మండల అధ్యక్షురాలు ఉషారాణి అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వినోద్, సిసి శ్రీనివాస్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా ప్రారంభించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లను త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆలూర్ నూతన మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీడీవో కార్యాలయం ద్వారా 9 గ్రామాల ప్రజలకు పరిపాలన సులభతరం అవుతుందని అన్నారు. మండల ప్రజలు పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించి పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలూర్ మండల బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ముక్కెర విజయ్, కొత్తూరు గంగాధర్, శ్రీకాంత్, యాదగిరి, ప్రమోద్, వైస్ మల్లారెడ్డి, నవనీత్, భాస్కర్, మహేష్, శ్రీనివాస్,హరీష్, శివ, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, ఎంపీడీఓ ఆర్మూర్ సాయిరాం, ఆలూర్ గంగాధర్, ఎంపీవో శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ లక్ష్మి, ఆర్మూర్ డిఎంహెచ్వో రమేష్, తహసీల్దార్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల రైతు కమిటీ అధ్యక్షునిగా జక్క పెంటయ్య



నవతెలంగాణ-లింగంపేట్

మండల రైతు కమిటీ అధ్యక్షునిగా గ్రామానికి చెందిన జక్క పెంటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల మున్నూరుకాపు సంఘం సమావేశంలో మండల అధ్యక్షులు గుండా బాల కిషన్ అధ్యక్షతనలో కంపెనీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షునికి శాలువా కప్పి సన్మానించారు. రైతు సమస్యలపై నిరంతరం రైతుల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించాలని రైతులకు అందుబాటులో ఉండాలని వారు సూచించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు కొలిమి రాములు, గాలెం అంజయ్య, మండల సలహాదారులు శంభుల సాయిలు, హీరో షోరూం కాశిరాం, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిర్దిష్టమైన లక్ష్యంతో చదవాలి

- జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-ఆర్మూర్


వెండింగ్ మిషన్‌ను విద్యార్థులకు అందజేస్తున్న జిల్లా జడ్జి

చిన్ననాటి నుండి విద్యార్థినిలు నిర్దిష్టమైన లక్ష్యంతో చదవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. పట్టణంలోని పెర్కిట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం సానిటరీ నాప్కిన్స్ వెండింగ్ మిషన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలల్లో చదివితేనే ర్యాంకులు వస్తాయని అనుకోవద్దని, నిర్దిష్ట గోల్ పెట్టుకొని చదువుకోవాలని అన్నారు. పదవ తరగతి కాగానే ఇంటర్, ఆ తర్వాత డిగ్రీ చదువు కాగానే పెళ్లిళ్లు చేస్తారని తెలిపారు. కలలు కనడమే కాదు వాటిని సహకారం చేసుకునేందుకు నిర్దిష్ట గోల్ ఉండాలని అన్నారు. సానిటరీ నాప్కిన్స్ వెండింగ్ మిషన్‌ను నవ్యభారతి విద్యాసంస్థల చైర్మన్ సంతోష్‌కుమార్ డొనేట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ సెక్రెటరీ పద్మావతి, సీనియర్ సివిల్ జడ్జ్ నసీం సుల్తానా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరళరాణి, జూనియర్ సివిల్‌జడ్జి దీప్తి వేముల, అడిషనల్ ఎస్పీ బస్వారెడ్డి, కేజీబీవీఎస్ జిల్లా అధికారిని భాగ్యలక్ష్మి న్యాయవాదులు ఎం కే నరేందర్, ఆనంద్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్, ప్రత్యేక అధికారిని గంగామణి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు వనజ రెడ్డి, వేల్పూర్ కేజీబీవీ ప్రత్యేక అధికారిని వినోద, ఉపాధ్యాయినీ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

బిజెపి నాయకుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు, పట్టణ అధ్యక్షులు నర్సింలు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నర్సింలు కుటుంబాన్ని పార్టీ తరపున తప్పకుండా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యువకుడు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్‌లోని బి.ఎడ్ కళాశాలలో సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌కు ఆపరేషన్ నిమిత్తమై రక్తం అవసరం కావడంతో వారికి కావాల్సిన రక్తనిధి కేంద్రాలలో లభించకపోవడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బచ్చు శ్రీధర్ కుమార్ సహకారంతో ఆయుష్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసి సకాలంలో రక్తాన్ని అందజేసినట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. మానవతా దృక్పథంతో రక్తదాతలు ముందుకు వస్తేనే ప్రాణాలను కాపాడవచ్చునని సకాలంలో రక్తాన్ని అందజేసిన బచ్చు శ్రీధర్‌కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రక్తదానం చేయాలనుకున్న వారు వారి యొక్క వివరాలను 9492874006 నెంబర్‌కి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి

నవతెలంగాణ-మద్నూర్

ఢిల్లీలో ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్ విజయవంతం చేయండి

- రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్

నవతెలంగాణ-కామారెడ్డి

హెచ్‌సియు భూములను కాపాడాలని, చలో సెక్రటేరియట్ విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ.. హెచ్‌సియు భూములను పెట్టుబడిదారులకు అప్పగించే ఆలోచనలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. హెచ్‌సియు విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరించి అక్రమ లాఠీచార్జి, అరెస్టులకు పాల్పడిన పోలీసుల తీరు విద్యార్థుల భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యార్థుల జోలికి, యూనివర్సిటీల జోలికి వస్తే విద్యార్థులు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అర్బస్ ఖాన్, నాయకులు పెరుమాండ్ల బుల్లెట్, కృష్ణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అక్రమ అరెస్టు హేయమైన చర్య

- ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంకు వ్యతిరేకంగా ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల వేలాన్ని ఆపాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు జేసీబీని అడ్డుకుంటూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనను విచ్ఛిన్నం చేసి పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్యని ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములనే కొల్లగొట్టేందుకు సిద్ధమైతే భవిష్యత్తులో యూనివర్సిటీలో ఉనికి ప్రమాదకరంగా మారునుందన్నారు. భూముల అమ్మకాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాన్నారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను విడుదల చెయ్యాలి, లేనిపక్షంలో విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హెచ్‌సీయు భూముల అమ్మకాలపై ప్రభుత్వం వెనక్కి తగ్గాలి

- విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం
- ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి

ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో గిరి రాజ్ డిగ్రీ కాలేజ్ ముందు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం ద్వారా అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిన్న యూనివర్సిటీలో భూములను చదును చేస్తున్న జెసిబిల అడ్డుకోవడానికి భూములను రక్షించుకోవడానికి వెళుతున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అడ్డుకొని ఇష్టానుసారంగా వారిని అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం యూనివర్సిటీ భూముల అమ్మకాలపై మొండిపట్టుకు పోకుండా యూనివర్సిటీలో ఉన్నతమైన ప్రమాణాలు, పరిశోధనలతో, నాణ్యమైన విద్యతో దక్షిణ భారతదేశంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ప్రత్యేకమైన గుర్తింపు పొందుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని రీసెర్చ్ సెంటర్లు, ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యశాఖ పెట్టుకుని ఇలా యూనివర్సిటీ భూములు అమ్మడం సిగ్గు చేటని అన్నారు., వెంటనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాల నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, నాయకులు వంశీ, శివాజీ, రమేష్, తేజు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : తెలంగాణ యూనివర్సిటీ సమితి అధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్, చందు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం ద్వారా అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో చత్రు, భార్గవు అజయ్, సుజాత, అమృత పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగిని సన్మానించిన పలువురు

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం

- జిల్లా లేబర్ అసిస్టెంట్ కమిషనర్ యోహాన్
- డిఎల్ పిఓ శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, ఉద్యోగంలో చేరినప్పుడే విరమణ తేదీ నిర్ణయించడం జరుగుతుందని, ఉద్యోగ రిత్యా చేసిన మంచి పనులను ప్రజల నుండి, అధికారుల నుండి ప్రశంసలు అందుకున్నప్పుడే అదొక మంచి గుర్తింపు లభిస్తుందని అది జీవితంలో మర్చి పోలేనిదిగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు ఉద్యోగ విరమణ బుదవారం మండల కేంద్రంలోని ఓక ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్మిక శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి యోహన్, డిఎల్ పిఓ శ్రీనివాస్ గౌడ్, పాత నాగరాజ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగంలో విరమణ సహజమని, విధినిర్వహణలో ఎందరికో మార్గదర్శకంగా నిలిచారని, వీధుల్లో అలసత్వం లేకుండా సమయానికి ముందే గ్రామంలో ఉంటు ప్రజల సాధక బాధల పరిష్కారం కోసం నిట్టు కిషన్ రావు తనవంతుగా కృషి చేశారని అన్నారు. నూతనంగా వచ్చిన వారు అయనను ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. అనంతరం నిట్టు కిషన్ రావు ఇందిరా రాణిలకు పూలమాలలు, శాలువాలు, మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ నివేదిత, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్ రావు, కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, కవిత, బాలకృష్ణ, నరేష్, దీవ్య, సలాం, తోపాటు సిబ్బంది సంతోష్,రాము, శ్యాంసన్, బాబా, నర్సయ్య తో పాటు అదికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహనీయుల విగ్రహాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎల్లారెడి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం విచ్చేస్తున్నారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో స్థానిక మండల అధ్యక్షులు జూకంటి వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు గైని శివాజీ, ఎస్సీ విభాగం మండల అధ్యక్షులు రాజేంద్ర, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అందరూ హజరై విజయవంతం చేయాలని ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్



మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మండల అభివృద్ధి అధికారి నరేష్ బుధవారం పరిశీలించారు. మండలంలోని పోతాయిపల్లి గ్రామ సమీపంలో చేపల చెరువు నిర్మాణం కొరకు ఉపాధి కూలీల పనులు చేపడుతున్నారు. ఎంపీడీవో కూలీలను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేపల చెరువు ఏర్పాటు చేయడం వల్ల ఆర్థికంగా బలపడతారన్నారు. ఎండలు తీవ్రంగా ఉండంతో ఉదయం పని ప్రదేశంలోకి త్వరగా చేరుకోవాలని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం కోమటిపల్లి ఊరు చెరువులో పూడికత పనులను పరిశీలించారు. చెరువులో పూడికత పనులు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఈయన వెంట ఎంపీఓ మలహరి క్షేత్ర సహాయకులు కుమార్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ప్రపంచ యవనికపై భారతదేశాన్ని అగ్రభాగాన నిలపాలి

- వీసీ టి.యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

2047 నాటికి భారతదేశానికి స్వతంత్రం సిద్ధించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న స్వతంత్ర భారతాన్ని వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవల రంగాల్లో అభివృద్ధిలో పరిగెత్తించి ప్రపంచ యవనికపై అగ్ర భాగాన నిలబెట్టేలా ఈ జాతీయ సెమినార్ రోడ్ మ్యాప్‌గా ఉపయోగపడాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జులై 17,18 తేదీల్లో ఎంపవరింగ్ ఇండియా 2047 స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ అనే జాతీయ అంశంపై రెండు రోజుల సదస్సు బ్రోచర్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి ష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్.టీ.యాదగిరిరావు మాట్లాడుతూ నేటి అధునిక కాలంలో పర్యావరణ కాలుష్యం వలన జన బాహుల్యానికి ఏర్పడిన అనేక అవరోధాలను నిరోధించుటకు గ్రీన్ టెక్నాలజీ ఉపయోగాన్ని, యువతలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించడానికి, సామాజిక న్యాయంతో సమ్మిళిత వృద్ధి సవాళ్లకు ఈ సెమినార్ సరియైన పరిష్కారాలను కనుగొనాలని ఆశిస్తున్నానన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తి విలువను 50 ట్రిలియన్ల సాధించడానికి దృష్టి సారించి, అంతర్జాతీయ వాణిజ్యంలోని కీలక అంశాలను చర్చించే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్, బిగ్‌డేటా, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల గురించి ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల ముఖ్య ప్రసంగాలు ఉండాలని, ఫలి తంగా ఆర్థిక కార్యకలాపాల పెంపు ప్రక్రియ లు, డిజిటల్ సాధనాల పురోగతితో, 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణాన్ని ప్రభావితం చేసే కీలక రంగాలను చర్చించడానికి విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులను ఒకచోట చేర్చడం అభినందనీయమన్నారు. ఈ సదస్సు లో పరిశోధకలకు, విద్యావేత్తలకు, విద్యార్థులకు పత్రాలను సమర్పించే అవకాశం ఉందని సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఏ పున్నయ్య తెలిపారు. ఆవిష్కరణలో సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫె సర్ గంటా చంద్రశేఖర్, కో కన్వీనర్ డా టి. సంపత్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాత నాగరాజ్, డాక్టర్ స్వప్న డా. సి హెచ్.శ్రీనివాస్, డాక్టర్ వి దత్త హరిలు పాల్గొన్నారు.